టమాట ధమాల్..

- మార్కెట్‌లో పడిపోయిన ధర
- కిలోన్నర పది రూపాయలు
- పెరిగిన పంటసాగు విస్తీర్ణం, అధిక దిగుబడి
- చేనులోనే పండిపోతున్న వైనం
- కూలీ, ట్రాన్స్‌పోర్టు, పెట్టుబడి రాక ఇబ్బందుల్లో రైతులు

మానకొండూర్: ఆరుగాలం కష్టపడి పండించిన టమాటకు మార్కెటులో రేటు పడిపోవడంతో దీన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కిలోన్నర పది రూపాయలు పలుకుతోంది. కూలీ, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు కూడా రావడం లేదని రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ధర పడిపోవడంతో టమాటను చేనులోనే వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల పంటను దున్నివేశారు. మరికొన్ని చోట్ల పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

గతంలో రైతులు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, శనగ, ఆముదం, పప్పు దినుసులు, వివిధ రకాల పంటల సాగుచేసేవారు. ప్రస్తుతం వరితో పాటు కేవలం కూరగాయల సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. కూరగాయల సాగు బెటర్ అన్న ధోరణిలో రైతులు సాగు చేపట్టడంతో విస్తీర్ణం పెరిగింది. గతేడాది జిల్లాలో 15 వందల ఎకరాల్లో సాగు కాగా దీని కన్నా మరో రెండు రేట్లు అధికంగా ప్రస్తుతం సాగుచేశారని దీంతో దిగుబడి పెరిగిందని రైతులు వాపోతున్నారు.

ఎకరాకు యాభై వేల పెట్టుబడి

మల్చింగ్ కవర్, దున్నడం, కూలీలు, కాంప్లెక్సు ఎరువులతో పాటు మందులకు ఎకరాకు యాభై వేలు ఖర్చు అయిందని,. అన్ని కష్టాలను ఎదుర్కొంటూ కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో రేటు పడిపోయిందని రైతులు బోరుమంటున్నారు. పెట్టుబడి నష్టపోయామని, రోజు కూలీ డబ్బులు, ట్రాన్స్‌పోర్టు చార్జీలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంత రైతులకు ట్రాన్స్‌ఫోర్టు ఖర్చు పెరిగింది.

కూరగాయల సాగుకే మొగ్గు

మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, పొద్దు తిరుగుడు, పప్పు దినుసులు గతంలో అధికంగా సాగు చేసేవారు. నానాటికి పంటల సాగు తగ్గిపోయింది. చాలా మంది రైతులు టమాట పండిస్తున్నారు. మండలంలోని ఈదులగట్టేపల్లి, ఖాదర్‌గూడెం, లింగాపూర్, తిమ్మాపూర్ మండలం పొరండ్ల, నుస్తులాపూర్, కొత్తపల్లి, రామక్రిష్ణాకాలనీ, తిమ్మాపూర్, చొప్పదండి, బోయినపల్లి మండలం నుంచి టమాట కరీంనగర్ మార్కెటుకు తరలిస్తారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంట సాగు చేయడం అక్టోబర్, సెప్టెంబర్‌లో ఎలాంటి వర్షాలు లేక పోవడం దిగుబడి పెరిగింది. దిగుబడికి తగ్గట్లు మార్కెట్లో టమాట రేటు పది రూపాయల కన్న తగ్గిపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. దీంతో రైతులు ఇక పంట సాగుకంటే తొలగించడమే మేలనుకున్నారు.


ఖాదర్‌గూడెంలో చేనులోనే టమాటను వదిలేసిన రైతు

పెట్టుబడి రావడం లేదు



టమాటకు మార్కెట్‌లో ధర లేకపోవడం మూలంగా పెట్టుబడి మీద పడింది. ఎకరాకు సుమారు యాభై వేలు ఖర్చు అయింది. టమాట సాగుకు పెట్టుబడి, పంట దిగుబడి వచ్చాక ట్రాన్స్‌ఫోర్టు చార్జీలు కూడా రావడం లేదు. రైతులందరూ ఒకేసారి టమాట సాగు చేయడంతో దిగుబడి పెరిగినా రేటు తగ్గింది.

– మాదాన కొమురయ్య, రైతు, తిమ్మాపూర్

క్లుప్తంగా

వివాదాస్పదంగా మార్కెట్ నిర్వహణ


సిబ్బందితో వ్యాపారులు, గ్రామస్తుల వాగ్వాదం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట కూరగాయల మార్కెట్ నిర్వహణ శుక్రవారం మళ్లీ వివాదాస్పదంగా మారింది. కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోడ్డులో అమ్మకాలు చేస్తుండగా, గ్రామ పంచాయతీ సిబ్బంది జీపీ ట్రాక్టర్‌తో కూరగాయలను తరలించేందుకు రావడంతో గొడవ ప్రారంభమైంది. వ్యాపారులతో పాటుగా కొందరు గ్రామస్తులు మార్కెట్‌ను పశువైద్యశాల వద్దకు తరలించొద్దని, ఇక్కడే నిర్వహించాలని దీంతో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారికి సౌకర్యంగా ఉంటుందని సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం పోలీసులకు తెలియడంతో మార్కెట్ నిర్వహిస్తున్న స్థలం వద్దకు రామడుగు ఏఎస్సై అనంతరెడ్డి వచ్చి వివరాలు సేకరించారు. వ్యాపారులతో పాటు, కొనుగోలుదారులు, గ్రామస్తులతో మాట్లాడారు. మార్కెట్ ఇక్కడ నిర్వహిస్తే సౌకర్యంగా ఉంటుందని చెప్పడంతో పంచాయతీ కార్యదర్శికి ప్రజలకు అనుకూలంగా ఉండే స్థలంలో నిర్వహిస్తే బాగుటుందని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కాగా మార్కెట్ గూర్చి సరైన నిర్ణయం ఆలోచించి తీసుకోవాలని సూచించారు.

పంచాయతీ భవన నిర్మాణ పనులు పరిశీలన


భవనాన్ని పరిశీలిస్తున్న రావుల రమేశ్

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ గ్రామ పంచాయతీ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సర్పంచ్ రావుల రమేశ్ భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేస్తూ మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. భవనాన్ని జనవరి 26 లోపు పూర్తి చేసి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ బేతి శ్రీనివాసరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్.డీ తాజుద్దీన్, వార్డు సభ్యులు గట్టయ్య, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే లక్ష్యం

సైదాపూర్: మహిళల భద్రత కోసం షీ టీంలు పనిచేస్తాయని ఎస్సై జన్ను ఆరోగ్యం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సోమారం గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. విద్యార్థులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి వాటిలో ఫొటోలు, వీడియోలు అప్లోడ్ చేయడం వల్ల వచ్చే సమస్యలు, సైబర్ నేరాలు తెలిపారు. బాలికలపై వేధింపులకు పాల్పడితే డయల్ 100, 1098, 9440785182 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థులే ఫోన్ వాడుతున్నారని వీటివల్ల సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉంటుందని, ప్రతిచోట జాగ్రత్త గా ఉండాలని ఆకతాయి పనులవల్ల జై లుకు పోయే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. ప్రిన్సిపల్ ఫర్హాన, షీ టీమ్ కానిస్టేబుల్ స్వప్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బట్టి విధానానికి స్వస్తి పలకాలి


మాట్లాడుతున్న ఎస్సై రాజన్న

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు సృజనాత్మకత విద్య వైపు అడుగులు వేయాలని ఎస్సై రాజన్న సూచించారు. శుక్రవారం పట్టణంలోని టెట్రా పాఠశాలలో నిర్వహించిన ఆంగ్ల, గణిత ఎగ్జిబిట్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తరగతి గదిలోనే విద్యా ర్థుల భవిష్యత్ తయారవుతుందని, విద్యార్థులు బట్టి విధానానికి స్వస్తి పలకాలకి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.కరస్పాండెంట్ నారాయణరెడ్డి, డైరెక్టర్లు రమణారెడ్డి, సంజీవరెడ్డి, సంతోష్‌రావు, సత్యనారాయణరావు, సంపత్‌రెడ్డి, రాజిరెడ్డి, ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

హుజూరాబాద్: రాష్ట్రంలో విద్యా రంగానికి సంబంధించిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీవీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్ రెడ్డీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సుమారు రూ.300 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

బూత్ కమిటీ సమ్మేళనం విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వెంకట్

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించనున్న బీజేపీ పోలింగ్ బూత్‌కమిటీ సమ్మేళనం విజయవంతం చేయాలని అసెంబ్లీ పాలక్ జెస్ వెంకట్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూత్ కమిటీ సమ్మేళనానికి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త, నాయకుడు పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పెరుక శ్రావణ్‌కుమార్, ప్రభారి రాజేశ్, కోల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ పరిధిలోని కిష్టారావుపల్లి గ్రామ నూతన బీజేపీ బూత్ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశామని బీజేపీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు కట్ట రవీందర్ తెలిపారు. అధ్యక్షుడిగా నీరుకుల్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా మిట్ల మధు, జిల్లాల మధు, ప్రధాన కార్యదర్శిగా మిట్ట శ్రీనివాస్, కార్యదర్శులుగా బండారి శ్రీశైలం, శనికుంట మహేందర్ పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జిట్టవేని అంజిబాబు, అశోక్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.650 కోట్లు

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.650 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు మండలాల్లో నూతనంగా 54 గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు రూ.10.80 కోట్లు మంజూరయ్యాయన్నారు. గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడానికి పల్లె దావఖానాలు ఏర్పాటు చేసి ఎంబీబీఎస్ డాక్టర్లను నియమించినట్లు, పల్లె దవాఖానాల కొత్త భవన నిర్మాణానికి ఒక్కోదానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని, పంచాయతీరాజ్ రోడ్లకు రూ.22 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ. 6.15 కోట్లు మంజూరు చేయించానన్నారు. చొప్పదండి మండల కేంద్రాన్ని రూ.72 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొండగట్టు దేవస్థానం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ వందకోట్ల రూపాయలు మంజూరు చేస్తామని ప్రకటించారన్నారు. మద్దుట్ల లిఫ్టులు, నారాయణపూర్ రిజర్వాయర్ సమస్యను పరిష్కరిస్తానన్నారు. దేశం మొత్తం బీఆర్‌ఎస్ వైపు చూస్తోందని, కేసీఆర్ ప్రధాని అయితే తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్ని దేశం మొత్తం అమలు చేస్తారని, కేంద్రంలోని ప్రభుత్వం ప్రజల కోసం ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేద, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటపరం చేస్తుందని విమర్శించారు. సమావేశంలో ఆరు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ప్రదానం


చొప్పదండి: అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్


హుజూరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో అవార్డుతో మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు

చొప్పదండి: దేశవ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2022 పోటీల్లో బహిరంగ మలవిసర్జన నిర్మూలన విభాగంలో చొప్పదండి మున్సిపాలిటీ ఎంపికైంది. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో వోడీఎఫ్ ప్లస్ ప్లస్ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజలు హర్షం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్: వోడీఎఫ్ ప్లస్ ప్లస్‌లో హుజురాబాద్ మున్సిపాలిటీకి అవార్డు దక్కిందని మున్సిపాలిటీ చైర్ పర్సన్ రాధిక తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో పక్కాగా పారిశుధ్య పనులు నిర్వహించామని, ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కమిషనర్ సమ్మయ్య అవార్డును అందుకోవడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి


మాట్లాడుతున్న మారం జగదీశ్వర్, తదితరులు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ ఇరిగేషన్ కార్యాలయంలో టీఎన్జీవో ఎల్‌ఎండీ యూనిట్ అధ్యక్షుడు పోలు కిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఈఎన్‌సీ శంకర్‌తో కలిసి టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు మారం జగదీశ్వర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ...ఉద్యోగులందరూ ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సంఘాలు భవిష్యత్‌లో కార్యాచరణ ప్రకటిస్తే అందరూ సంఘటితంగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో హెల్త్ కార్డు పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఉద్యోగుల సమస్యలపై త్వరలో కరీంనగర్ నుంచి మరో ఉద్యమం ప్రారంభం కానుందని అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంఘం లక్ష్మణరావు, జిల్లా ఈసీ మెంబర్ సరిత, యూనిట్ ప్రధాన కార్యదర్శి అంబటి నాగరాజు, నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, ఒంటెల రవీందర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుప్పాల అశోక్ రెడ్డి, కయ్యం శ్రీనివాస్, యుగెందర్ రెడ్డి, పత్తెం శ్రీనివాస్, ధనలక్ష్మి, ఫోర్త్ క్లాస్ అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి రాజయ్యలున్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కా ర్మికుల మూడు చట్టాలను రద్దు చేసి ఓఎస్‌హెచ్ కోడ్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఐటీయూ) పిలుపు మేరకు ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా రూ.64 కోట్లు నిధులు భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఉ న్నాయని,. వీటిని భవన నిర్మాణ కార్మికులకు విని యోగించకుండా లేబర్ డిపార్ట్‌మెంట్ మెయింటెనెన్స్, అధికారుల జీతాలు, పాలకుల అడ్వటైస్ కోసం వినియోగిస్తున్నారని అన్నారు. తెలంగాణ బిల్డింగ్–అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, జిల్లా కోశాధికారి జగదీశ్, జిల్లా ఉపాధ్యక్షులు సమ్మయ్య, కనకయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రాజకుమారి, కవిత, వెంకన్న పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వేంకటేశ్వర ఆలయంలో పూజలు


అయ్యప్పస్వాములకు భిక్ష

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ గ్రామ శివారులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకొని సాంప్రదాయ వంటకాలు చేశారు. రసాయనాలు లేని కొత్తరకం బియ్యంతో పాటు, కొర్రలతో బెల్లం అన్నం చేసి అయ్యప్పస్వాములకు భిక్ష నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దాతలు పౌర్ణమిని పురస్కరించుకొని రసాయనాలు లేని వంటకాలను సిద్ధం చేసి గ్రామస్తులకు కూడా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ రవీందర్, ఉపసర్పంచ్ చిరంజీవి, డీలర్ రాము, శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ చైర్మన్ భాస్కర్ పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయంలో..

పుష్య పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణ శివారులోని శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అభిషేకం, కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేప్టారు. పల్లకి సేవలో భాగంగా ఉంజాల్ సేవ, లలిత సహస్ర పారాయణ నిర్వహించారు. సింహాచలం జగన్‌మోహన్‌స్వామి, శ్రీభాష్యం నవ్యకుమార్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి గ్రానైట్ అందజేత


గ్రానైట్ దించుతున్న దృశ్యం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ గ్రానైట్ అందించారని శుక్రవారం ఆలయ నిర్మాణ కమిటీ కార్యదర్శి రాజేందర్ తెలిపారు. పునర్నిర్మాణంలో భాగంగా జీర్ణోద్ధరణ పనులు వేగవంతంగా నడుస్తున్నాయని, గ్రానైట్ అవసరం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను అడగ్గా లక్ష రూపాయలకుపైగా విలువ చేసే గ్రానైట్ అందజేశారని తెలిపారు. స్పందించిన ఎంపీకి ఆలయ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహన సదస్సు

చొప్పదండి: జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు 10న చొప్పదండిలోని జీఆర్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై ఉదయం 11 గంటల నుంచి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తయారీ రంగం, సేవల రంగంలో ప్రభుత్వం అందించే రాయితీలను వివరించనున్నట్లు చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సదవకాశం ఉపయోగించుకోవాలని కోరారు.

వసతిగృహం సందర్శించిన జెడ్పీటీసీ


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎంతో కృషి చేస్తోందని జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటు చేసిందని, విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువస్తుందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. హాస్టల్ వార్డెన్ అందుబాటులో ఉండాలని. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి సమస్యలున్నా తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మైస మహేందర్, క్రాంతికుమార్, బాబు, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న వైద్యులు

హుజూరాబాద్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి పర్యవేక్షణ వైద్యాధికారి రాజేందర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష ఉపాధ్యక్షులు మనోజ్, వెంకట్‌రెడ్డి, ఆర్‌ఎంఓ సుధాకర్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


పరీక్షలు చేయించుకుంటున్న గందె రాధిక

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీనివాస విజన్ సెంటర్ ఆవరణలో సుసన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామని ఫౌండేషన్ చైర్మన్ తోటపల్లి ఎలీషా శుక్రవారం తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో బీపీ,షుగర్,ఈసీజీ, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశామని, పలువురికి కంటిలో శుక్లం ఉన్నట్లు గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేపిస్తామని క్యాంప్ నిర్వాహకులు తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ గందె రాధికాశ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డానియల్, డేవిడ్ రాజు, రెవ డాక్టర్ పి. ఆర్. నెల్సన్ తిమోతి, సతీష్, కిష్టయ్య, ఆనంద్, కార్తీక్ పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించాలి

హుజూరాబాద్: బీసీ విద్యార్థుల సంక్షేమం కోసం హుజురాబాద్‌లో నూతన బీసీ హాస్టల్ నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేషబోయిన రాముయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. విద్యార్థులను వేరే ప్రాంతానికి తరలించి, అద్దె భవనంలో ఉంచి పాఠశాలకు విద్యార్థులు తీసుకెళ్లడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బీసీ హాస్టల్‌ను నిర్మించాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని హె చ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు అనుదీప్, శ్రీకాంత్,నాగ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకూ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.71 కోట్ల నిధులు మంజూరయ్యాయని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి జీవో జారీ అయిందని, జీవో విడుదల చేయించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్..

అక్రమంగా మట్టి తరలించిన వ్యక్తిపై కేసు నమోదు

సైదాపూర్: మండలంలోని ఎలబోతారం పావురాల చెరువు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలించిన కుంచం సాయికుమార్‌పై కేసు నమోదు చేశామని సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం శుక్రవారం తెలిపారు. ఈ నెల 2న తహసీల్దార్ సదానందం ఆదేశం మేరకు మట్టి తరలిస్తున్న వాహనాలు జేసీబీ, మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామని, తహసీల్దార్ ఫిర్యాదు మేరకు వాహనాలతో పాటు సాయికుమార్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.